క్లుప్తంగా

ఐదుగురిపై కేసు నమోదు

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరులో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గుణపై దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దారం ఆదిలక్ష్మి సోమవారం తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై అదే గ్రామానికి చెందిన సురేంద్ర, సుమతి, విష్ణు, తిరుమలేష్, గురునాథం దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. పాల్గుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

క్రీడా సామగ్రి వితరణ


సామగ్రి అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

చిల్లకూరు: మండలంలోని వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాతలు సోమవారం క్రీడా సామగ్రిని వితరణ చేశారు. పాఠశాలలో 2006–07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సుమారు 30 మంది తమ వంత సాయంగా పాఠశాలలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, వరగలి ఎంపీటీసీ సభ్యుడు దారా కోటేశ్వరరావు, సీఆర్పీ ఏడుకొండలు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా రూ.5.36 కోట్లు మంజూరు

కోట: మండలంలోని పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.5.36 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఏపీఎం రత్నయ్య సోమవారం తెలిపారు. మండలంలో 682 గ్రూపులు ఉండగా 6,748 మంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. వీరందరి బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

దొరవారిసత్రం: గర్భిణులు, పిల్లలు మంచి పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ శారదాంబ అన్నారు. సోమవారం దొరవారిసత్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ స్థాయిలోని కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులకు పోషణ్ పక్వాడ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రాగులు, సజ్జలు, సాములు, కొర్రలు తదితర చిరుధాన్యాలు తీసుకుంటే రక్తహీనత సమస్య రాదన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహిత తదితరులు పాల్గొన్నారు.

అన్నపై హత్యాయత్నం కేసులో తమ్ముడి అరెస్టు

నాయుడుపేటటౌన్: అన్నపై హత్యాయత్నానికి పాల్పడిన తమ్ముడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెళ్లకూరు రోసనూరు రాజుపాళెం గ్రామానికి చెందిన పల్లిపాటి వెంకటేశ్వర్లును తమ్ముడు పల్లిపాటి వెంకటేష్ నగదు బాకీ విషయమై జరిగిన ఘర్షణలో కత్తితో దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై పోలీసులు ఈ నెల 25 తేదీన కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న వెంకటేష్‌ను సోమవారం పాత బస్టాండ్ కారు స్టాండ్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నకిలీలకు అడ్డుకట్టకు చర్యలు


శ్యాంపిల్లను పరిశీలిస్తున్న ఏఓ భవాని

చిల్లకూరు: నకిలీ పురుగు మందుల విక్రయానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చిల్లకూరు ఏఓ గూడూరు భవాని తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఎరువుల దుకాణాల యజమానులు విక్రయించే పురుగు మందుల శ్యాంపిళ్లను సేకరించి, వాటిని ల్యాబ్‌కు పంపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉండేలా ఆర్బీకేలను ఏర్పాటు చేసిందన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న శైలజ

సైదాపురం: ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించాలని, అందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందని ఏపీఎం శైలజ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం వీఓఏలతో ఆమె సమీక్షించారు. ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను నూరు శాతం రికవరీ చేయాలన్నారు. రుణాలను చెల్లించని గ్రూపుల వివరాలను అందజేయాలన్నారు. ప్రతి మహిళనూ పొదుపు సభ్యురాలిగా చేర్చాలన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


కూచివాడ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య


సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య, ప్రజాప్రతినిధులు

నాయుడుపేటటౌన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని కూచివాడ సచివాలయ పరిధిలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, ఇప్పటివరకు వారు పొందిన పథకాల లబ్ధిని గురించి తెలిపే బుక్‌లెట్లను అందజేశారు. కూచివాడలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తరువాత కూచివాడలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగనన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో సోమవారం సాయంత్రం మెప్మా, వైఎస్సార్ క్రాంతిపథం అధికారుల ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తానని, ఎవరూ బ్యాంకులకు నగదు చెల్లించవద్దని చెప్పి, అధికారంలోకి వచ్చి చంద్రబాబు ఆ తరువాత మహిళలను మోసం చేసి పొదుపు సంఘాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మాట తప్పని, మడమ తిప్పని నేతగా సువర్ణ అధ్యాయం సృష్టించారన్నారు. అనంతరం మున్సిపాలిటీపరిధిలోని 4,569 మందికి రూ.3.58 కోట్లు, మండలంలో 5,469మందికి రూ.3.77 కోట్లు మూడో విడత ఆసరా నగదు నమూనా చెక్కులను ఎమ్మెల్యే సంజీవయ్య మహిళలకు అందజేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు మహిళ ప్రజాప్రతినిధులు, నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో వాకాటి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకట రమణారెడ్డి, చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కట్టా జ్యోతిరెడ్డి ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, కటకం జయరామయ్య, ఎం దయాకర్ రెడ్డి, సీ కరుణాకర్‌రెడ్డి, అన్నమేడు పీఏసీఎస్ చైర్మన్ శ్యామ్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శంకరయ్య, చమదం రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, పేర్నాటి రాహుల్, కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శివప్రసాద్, మెప్మా సీఎంఎం పెంచలయ్య పాల్గొన్నారు.

జన సంక్షేమమే జగనన్న లక్ష్యం


వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బుక్‌లెట్ అందజేసి లబ్ధి పొందిన పథకాలను వివరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): జన సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండలంలోని నిడిగల్లు సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత నిడిగల్లు పంచాయతీ కేంద్రానికి విచ్చేసిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ఇంటింటా తిరిగి లబ్ధిదారులు ఎంత లబ్ధి పొందారన్న విషయం వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి, రంగనాథం, మధుసూదన్‌రావు, సర్పంచ్‌లు చప్పిడి గాయత్రి, గోపికృష్ణారెడ్డి, రమేష్ చౌదరి, రామతులసి, ఎంపీటీసీ సభ్యురాలు చెలికం రత్నమ్మ, నాయకులు చెలికం చిరంజీవిరెడ్డి, కోబాకు శ్రీనివాసులరెడ్డి, దశరథరామిరెడ్డి, మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు హనుమంతు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి


దక్కిలి: చెక్కు అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దక్కిలి వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ కార్యక్రమానికి రామ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం దక్కిలి మండలంలో 577 పొదుపు సంఘాలకుగాను 5,793 మందికి రూ.3.85 నమూన చెక్కును మహిళలకు అందజేశారు. తరువాత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పొదుపు మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి చింతల శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ గోను రాజశేఖర్, మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ విక్రమ సింహపురి రీజియన్ మాజీ చైర్మన్ చెలికం శంకరరెడ్డి, మాదిరెడ్డి మునిరామ్‌రెడ్డి, దువ్వూరు రవీంద్రారెడ్డి, పీ దశరథరామిరెడ్డి, నర్రావుల ప్రకాశం నాయుడు, మాదమాల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు అధికం


పెళ్లకూరు: మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి


వెంకటగిరి: మాట్లాడుతున్న సీడీపీఓ

వెంకటగిరి: చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, కిశోర బాలికలు వాటిని ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చని సీడీపీఓ షంషాద్ బేగం తెలిపారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్, బంగారుపేట ఉన్నత పాఠశాలల్లో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకుంటే రక్తహీనత, ఐరన్, విటమిన్ సీ లోపం నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆరోగ్యం మెరుగు

పెళ్లకూరు: రాగులు, సజ్జలు, పెసర, మినుము, నువ్వులు, వేరుశనగ, మొక్కజొన్న తదితర చిరు ధాన్యాలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయ భవనంలో జరిగిన చిరుధాన్యాలపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. పిండి పదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడంతో స్థూలకాయంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని సూచించారు. ఈ క్రమంలో ప్రభుత్వ సూచనల మేరకు చిరుధాన్యాలను విరివిగా వాడాలన్నారు. ముఖ్యంగా మొలకెత్తిన సజ్జలు, రాగులు, పెసర, మినుములు, వేరుశనగ తదితర డ్రైఫ్రూట్స్ వాడుకోవాలన్నారు. అనంతరం వెలుగు సీసీలు తీసుకొచ్చిన చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, ఎంపీడీఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత


దాతను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఓజిలి: మండలంలోని చిలమానుచేను ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతికి అవసరమైన కంప్యూటర్‌ను గూడూరు పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ వాకా శ్రీహరి ప్రసాద్ సోమవారం వితరణ చేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. దాత శ్రీహరి ప్రసాద్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అనుసూయ, జమ్ముల శ్రీనివాసులు, చల్లా ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సాయం


సామగ్రి అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

గూడూరు: రెండో పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గూడూరుకు చెందిన పానకా మల్లికార్జునరెడ్డి సాయం చేశారు. వంట సామగ్రి, సీలింగ్ ఫ్యాన్లు, తినుబండారాలు అంగన్‌వాడీ కార్యకర్తకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, వేమారెడ్డి సురేంద్రరెడ్డి, కోట శ్రీనివాసులు, సీడీపీఓ మెహబూబా, సూపర్‌వైజర్ ఆషాబేగం పాల్గొన్నారు.

వేలంలో రూ.16 వేల ఆదాయం

వెంకటగిరి: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్కూటర్ వేలం పాటలో రూ.16 వేల ఆదాయం వచ్చిందని గూడూరు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జానకిరామ్ తెలిపారు. వేలం పాటలో ఏ సుందరయ్య స్కూటర్‌ను రూ.16 వేలుకు హెచ్చుపాట పాడి దక్కించుకున్నారన్నారు. అదనంగా జీఎస్టీ మరో రూ.1,920తో కలిపి రూ.17,920 చెల్లించిన తర్వాత వాహనాన్ని అప్పగిస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్ పి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు రూ.4.80 కోట్ల లబ్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి

ఓజిలి: వైఎస్సార్ ఆసరాతో మండలంలోని మహిళలకు రూ.4.80 కోట్ల లబ్ధి చేకూరిందని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు ఏపీఎం, వైఎస్సార్‌సీపీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులు మీదుగా జరిగే వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా ఓజిలి మండలంలో 621 సంఘాల్లోని 5,877 మందికి రూ.4.80 కోట్లుతో లబ్ధి చేకూరిందన్నారు. ఏపీఎం నిర్మలమ్మ, నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాదర్తి హరనాథ్‌రెడ్డి, ముమ్మడి సుబ్బరావుయాదవ్, సర్పంచ్ కొండూరు ప్రభాకర్‌రాజు, జమళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ


ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్థానిక శివసాయి కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ జి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని, వారు ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.జనార్దన రెడ్డి, కళాశాల ఏఓ కె.పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

గడపగడకు మన ప్రభుత్వం నేడు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని నిడిగల్లు, సిద్ధాగుంట గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాపులూరులో..

నాయుడుపేటటౌన్: మండలంలోని కాపులూరు గ్రామంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెసీఎస్ మండల కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఉదయం 7.00 గంటలకు, తిరిగి సాయంత్రం 3 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక మేళాకు నెల్లటూరు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

గూడూరురూరల్: మండలంలోని నెల్లటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పి.సుజిత్, ఏ.హారిక, జి.గాయత్రి గైడ్ టీచర్ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్లాస్టిక్ వాడకానికి బదులుగా వరి పొట్టు, గోధుమ పొట్టుతో ప్లేట్స్ తయారీ ప్రాజెక్ట్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు వినూత్న ఆలోచనతో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఇలాంటి ప్రాజెక్ట్ చేపట్టడం, దానికి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషాద్రి, బాబు, విజయ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

సూళ్లూరుపేట: స్థానిక పురపాలక సంఘం 2023–2024 బడ్జెట్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు గాండ్లవీధిలోని స్త్రీశక్తి భవన్‌లో జరుగుతుందని కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభ్యుల సమక్షంలో ప్రవేశ పెట్టనున్నారన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులందరూ హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ ఆసరా సంబరాలు..

వెంకటగిరి: స్థానిక ఎస్‌ఆర్ గార్డెన్స్‌లోని ఫంక్షన్‌హాల్‌లో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ సంబరాలు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు హాజరుకానున్నారని చెప్పారు.

ద్విచక్రవాహనాల వేలం..

తడ: ఎస్‌ఈబీ అధికారులు ఇటీవలి కాలంలో అక్రమ వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్టు ఎస్‌ఈబీ సీఐ సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు ద్విచక్రవాహనాలకు సంబంధించి రూ.10 వేలు ప్రభుత్వ ధర నిర్ణయించినట్టు పేర్కొన్నారు.

అలంకరణ చేపల పెంపకంతో లాభాలు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆనంద్‌ప్రసాద్

వాకాడు: రంగు రంగుల(అలంకరణ) చేపల పెంపకంతో మంచి లాభాలు వస్తాయని ప్రొఫెసర్ ఆనంద్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో భారతదేశ తీర ప్రాంత కమ్యూనిటీలు, వాతావరణ స్థితి స్థాపకతను పెంపు, అలంకరణ చేపల పెంపకం తదితర అంశాలపై మత్స్యశాఖ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్స్య సంపదపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగానే రంగు రంగుల చేపల పెంపకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి, సాగుకు అవసరమైన పెట్టుబడులు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఈ చేపలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీనాథ్, ఏడీ చాంద్‌బాషా, జెడ్పీటీసీ సభ్యుడు రొతు రామకృష్ణ, ఎఫ్‌డీఓ రెడ్డి నాయక్, నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారులు రఘుబాబు, నాగరాజు, శీను, రమేష్, సాయి, జగపతిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రజనీకాంత్

ఓజిలి: మండలంలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నుడా పరిధిలో 244 ఇళ్లకుగాను 75 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని తెలిపారు. తుడా పరిధిలో మంజూరైన 60 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శివప్రసాద్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సిరాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు


జాబితాను చూపుతున్న తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ

కోట: స్థానిక బజారువీధిలో ఆక్రమణల తొలగింపునకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఆక్రమణల కారణంగా రోడ్లు కుచించుకుపోవడంతో ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. ఈ క్రమంలో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా ఆక్రమణల తొలగింపు దిశగా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా వారం రోజులపాటు సర్వే చేసి, మార్కింగ్ ఇచ్చారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించి నిర్ణయాన్ని ప్రకటించారు. మొత్తం 333 మందికి నోటీసులు అందజేస్తున్నట్లు తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ జాబితాను ప్రకటించారు. కోటక్రాస్ రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్ మీదుగా కొక్కుపాడు రోడ్డు వరకు రోడ్డుకిరువైపులా ఆక్రమణలకు పాల్పడిన 333 మంది దుకాణదారులకు నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అభ్యంతరాలున్న వారు వారం లోపు తహసీల్దార్ కార్యాలయంలో తమ సమస్యను తెలుపుకోవాలన్నారు. మండల సర్వేయర్ గోపీనాథ్, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

నాయుడుపేటటౌన్: చెన్నై నుంచి నెల్లూరు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి లారీని ఢీకొని, బోల్తా పండింది. ఈ సంఘటన సోమవారం మండలంలోని నరసారెడ్డి కండ్రిగ వద్ద జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన లోకనాథం, సుజిత్, చైతన్యలు కారులో చెన్నై నుంచి నెల్లూరుకు బయలుదేరారు. మార్గం మధ్యలోని నరసారెడ్డికండ్రిగ వద్ద ముందు వెళుతున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో దాని వెనుకన వస్తున్న వారి కారు అదుపు తప్పి లారీని ఢీకొని, బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న లోకనాథం, సుజిత్‌కు గాయాలయ్యాయి. వీరికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు చేయించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో రాపూరు ఎంపీపీ మృతి


బాలకృష్ణారెడ్డి(ఫైల్)

రాపూరు: స్థానిక ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి (76) సోమవారం ఉదయం బెంగళూరులో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతదేహన్ని బెంగళూరు నుంచి రాపూరు మండలం సంక్రాంతిపల్లెలోని ఆయన నివాసానికి సాయంత్రం 6 గంటలకు తీసుకువచ్చారు. ఆయన మృతదేహాన్ని జిల్లాలోని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, చేవూరి దేవకుమార్‌రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పాపకన్ను దయాకర్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రాపూరు ఎంపీపీ మృతి విచారకరం

వెంకటగిరిరూరల్: రాపూరు ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందడం విచారకమని వెంకటగిరి ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సన్మానం

గూడూరురూరల్: మండలంలోని నెర్నూరు ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత కొండూరు వేంకటేశ్వరరాజు శోభకృత్ నామ ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొని, సన్మానం అందుకున్నారు. నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నెల్లూరు పురమందిరంలో జరిగిన కవితోత్సవంలో ఉగాది విశిష్టత తెలిపే కవితా రచనతో ఆకట్టుకున్నారు. ఈ మేరకు నిర్వాహకులు వెంకటేశ్వరరాజుకు జ్ఞాపిక అందించి శాలువాతో సత్కరించారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ్ కార్యక్రమాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్‌కే మహబూబీ, సూపర్‌వైజర్లు నాగిశెట్టి రేణుక, శివజ్యోతి తద పాల్గొని గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు.

లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

తడ: మండలంలో భూమి లేని పేదలకు ప్రభుత్వం భూపంపిణీ చేయడానికి అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రామయ్య సోమవారం తెలిపారు. 28వ తేదీన ఉదయం పెరియవట్టు, మధ్యాహ్నం బీవీ పాళెం, అనంతరం పూడి గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. 29వ తేదీన ఇరకం, 31వ తేదీన వేనాడు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పేర్కొన్నారు.